సాక్షి తిరుపతి

మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,260
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,293

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.69,700
రిటైల్ వెండి గ్రాము	రూ.71.70

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	31	18
చిత్తూరు	34	18
తిరుమల	30	14
గూడూరు	34	20
నగరి	35	19



డ్రోన్‌తో పిచికారీ

పుత్తూరు మండలం తొరూరు గ్రామంలో సోమవారం డ్రోన్లతో మందులను పిచికారీ చేసే విధానంపై కేవీకే శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. - పుత్తూరు రూరల్

న్యూస్‌రీల్

11న సూళ్లూరుపేటలో జాబ్‌మేళా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: సూళ్లూరుపేటలో ఈనెల 11న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన 13 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయని, వెయ్యిమందికి ఉద్యోగాలు ఇవ్వనున్నట్టు వెల్లడించారు. అదనపు సమాచారం కోసం 9177508279, 9966601867 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు. తిరుపతి జిల్లా డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, స్కిల్ డెవలప్మెంట్ జిల్లా అధికారి శ్యామ్మోహన్ పాల్గొన్నారు.

స్పందనకు 58 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైం: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 58 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చినట్టు వెల్లడించారు. వీటిని సంబంధిత పోలీస్ స్టేషన్‌లకు పంపి వెంటనే పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతామని చెప్పారు.

సైన్స్ సెంటర్‌లో 12 నుంచి వార్షిక సైన్స్ క్విజ్ పోటీలు

తిరుపతి అలిపిరి: తిరుపతి సైన్స్ సెంటర్‌లో తిరుపతి రోటరీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఆస్ట్రానమీ సబ్జెక్టుల్లో సాంకేతికతపై వార్షిక సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్టు కో-ఆర్డినేటర్ కోలా శ్రీనివాసనెహ్రూ తెలిపారు. ఈ నెల 12న ప్రిలిమినరీ రౌండ్, 18, 19 తేదీల్లో క్వాలిఫైయింగ్ రౌండ్, 25, 26 తేదీల్లో సెమీఫైనల్ రౌండ్, 28న ఫైనల్ రౌండ్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 8, 10 తరగతుల విద్యార్థులు అర్హులని, ఒక్కో పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఒక టీంగా, ఎన్ని టీంలైనా పాల్గొనవచ్చని వెల్లడించారు. ఈనెల 11 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని తెలిపారు. వివరాలకు సైన్స్ సెంటర్‌లోని విద్యావిభాగం, లేదా 0877 2286202, 7989694681లో సంప్రదించాలని ఆయన సూచించారు.

నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టనున్నట్టు టీటీడీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజ సామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాన్ని ఆలయంలో సంప్రోక్షణం చేస్తారు.

11 నుంచి కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో 11 నుంచి 20వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా 8వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. 11న ధ్వజారోహణం, రాత్రి హంస వాహనం, 12న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలు, 13న భూత, సింహ వాహనాలు, 14న మకర, శేష వాహనాలు, 15న తిరుచ్చి ఉత్సవం, అధికార నంది వాహనం, 16న వ్యాఘ్ర, గజవాహనాల సేవలు ఉంటాయి. 17న కల్పవృక్ష వాహనం, అశ్వ వాహనం, 18న రథోత్సవం, నంది వాహనం, 19న పురుషామృగ వాహనం, కల్యాణోత్సవం, తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తారు. 20వ తేదీన నటరాజ స్వామి వారు సూర్యప్రభ వాహనం, త్రిశూలస్నానం, రాత్రి ధ్వజావరోహణం, రావణాసుర వాహన సేవలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఈ మేరకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

నాపేరు పనబాక లక్ష్మి. దొరవారి సత్రం మండలం, కేడీకండ్రిగ గ్రామం. నా పేరున 4.03 ఎకరాల భూమి ఉంది. దీనికి కొన్ని సమస్యలు ఉండడంతో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. వైఎస్సార్ జగనన్న భూహక్కు.. భూరక్ష పథకం ద్వారా అధికారులు పకడ్బందీగా సర్వే చేశారు. ఎప్పటి నుంచో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించారు. భూమిపై సర్వహక్కులు కల్పిస్తూ భూ హక్కు పత్రాలు కూడా పంపిణీ చేశారు. చాలా సంతోసంగా ఉంది. ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటాం.



నా పేరు వాసురెడ్డి. మాది పిచ్చాటూరు మండలం, అప్పంబట్టు గ్రామం. నాపేరు మీద 3 ఎకరాల భూమి ఉంది. ఆక్రమణల కారణంగా తరచూ సమస్యలు వచ్చేవి. నిత్యం ఆందోళన చెందవాడ్ని. రీ సర్వేలో స్పష్టంగా నా భూమి వివరాలు తెలిపారు. సరిహద్దులు చూపారు. కచ్చితమైన కొలతలతో రాళ్లు కూడా నాటారు. ఇక నా భూమికి ఏ ధోకా లేదు. వైఎస్సార్ జగనన్న భూ సర్వేపై ప్రతి రైతు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పైసా ఖర్చులేకుండా ప్రభుత్వమే సర్వే చేయడం చిన్నవిషయం కాదు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.



భూ సర్వే అద్వితీయం!

జిల్లాలో ముమ్మరంగా వైఎస్సార్ జగనన్న భూ హక్కు- భూసర్వే

- ఇప్పటికే మొదటి విడత పూర్తి
- రెండో విడతలో 202 గ్రామాల్లో సర్వే
- ఈనెలాఖరుకు పూర్తిచేయాలని టార్గెట్
- హర్షం వ్యక్తం చేస్తున్న భూయజమానులు

తిరుపతి అర్బన్ : గ్రామాల్లో భూ తగాదాలకు తావు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు.. భూ రక్ష పథకాన్ని ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తోంది. ఈ ఏడాదిలోనే జిల్లా మొత్తం భూ సర్వేచేపట్టి యజమానులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేయాలని యంత్రాంగానికి దిశానిర్దేశం చేసింది. ఇందులో భాగంగానే జిల్లాలో ఇప్పటికే మొదటి విడత భూ సర్వేని పూర్తి చేయగా.. రెండో విడత సర్వేను ఈ నెలలోపే పూర్తి చేసేదిశగా ముందుకు సాగుతోంది. వచ్చేనెలలో మూడో విడత సర్వే చేపట్టాలని భావిస్తోంది. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

స్పందనలో భూసమస్యలే అధికం

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంటకుపైగా నిర్వహించే స్పందన కార్యక్రమంలో భూసమస్యలే అధికంగా కనిపిస్తున్నాయి. మొత్తం అర్జీల్లో 60 శాతం మేర రెవెన్యూకు సంబంధించిన సమస్యలే వస్తున్నాయి. ఈ క్రమంలో సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వంలో రెవెన్యూ సమస్యలకు చెక్ పెట్టడానికి వందేళ్ల తర్వాత భూముల సర్వేను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. భూసర్వేలో కచ్చితమైన వివరాలతో సర్వేలు నిర్వహించి యజమానికి భూహక్కు పత్రాలను అందజేస్తున్నారు. ఒక్కసారిగా కాకుండా నాలుగు విడతల్లో భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నాలుగు విడతల భూముల సర్వే పూర్తిచేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు.



సర్వే రాళ్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

మొదటి విడతలో 14 మండలాల్లో సర్వే పూర్తి

జిల్లాలో 34 మండలాలున్నాయి. వీటిని నాలుగు రెవెన్యూ డివిజన్లగా విభజన చేశారు. వీటి పరిధిలో 1,051 గ్రామాల్లో 6.5 లక్షల ఎకరాల్లో భూసర్వే చేయాల్సి ఉంది. ఇప్పటికే తొలి విడతలో 14 మండలాల్లో 25 వేల ఎకరాల్లో సర్వేను పూర్తిచేశారు. వంద మంది సర్వేయర్లు అత్యాధునిక సర్వే పరికరాలతోపాటు డ్రోన్లను ఉపయోగించి సర్వే చేపట్టారు. ఆ మేరకు సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేసి, 6,535 మందికి భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. రెండో విడతలో 17 మండలాల పరిధిలో.. 202 గ్రామాల్లో 2.5 లక్షల ఎకరాల్లో సర్వే కొనసాగుతోంది. ఇప్పటికే 18 గ్రామాల్లో సర్వేకి సంబంధించిన అన్ని పనులు పూర్తిచేసి భూ హక్కుపత్రాల పంపిణీకి యంత్రాంగం సిద్ధమైంది. ఇక 104 గ్రామాల్లో సర్వే పూర్తిచేయగా.. ఇందులో ఇతరత్రా ప్రక్రియలు పూర్తిచేయాల్సి ఉంది. 98 గ్రామాల్లో భూ సర్వే వివిధ దశల్లో ఉంది. ఫిబ్రవరి 28వ తేదీకి మొత్తం భూ సర్వే పూర్తిచేయాలని టార్గెట్‌గా నిర్ణయించుకుంది.



సర్వే రాళ్లు తీసుకెళ్తున్న రైతులు

జిల్లా సమాచారం

మండలాలు	- 34
రెవెన్యూ డివిజన్లు	- 04
రెవెన్యూ గ్రామాలు	- 1,051
సర్వే చేసే భూమి	- 6.5 లక్షల ఎకరాలు
తొలి విడతలో సర్వే గ్రామాలు	- 69
భూములు	- 25 వేల ఎకరాలు
సర్వేయర్లు	-100 మంది
రెండో విడతలో సర్వే గ్రామాలు	- 202
భూములు	2.5 లక్షల ఎకరాలు
సర్వేయర్లు	-190 మంది
మూడో విడతలో సర్వే గ్రామాలు	- 330
భూములు	1.15 లక్షల ఎకరాలు
సర్వేయర్లు	- 250 మంది
నాల్గువ విడతలో సర్వే గ్రామాలు	- 450
భూములు	2.6 లక్షల ఎకరాలు
సర్వేయర్లు	-360 మంది

ఈనెల చివరికల్లా రెండో విడత సర్వే పూర్తి



ఇప్పుడు ప్రతి సర్వేయర్‌కు భూ సర్వేపై పూర్తి అవగాహన వచ్చింది. ఈ క్రామంలోనే విడతల వారీగా సర్వేయర్ల సంఖ్యను, సర్వే చేయాల్సిన గ్రామాలను, విస్తీర్ణాన్ని పెంచుతున్నాం. సర్వేలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తున్నాం. తప్పులు లేకుండా సర్వే చేస్తేనే ప్రయోజం ఉంటుందని కలెక్టర్, జేసీ స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. రెండో విడత సర్వే కొనసాగుతోంది. ఇప్పటికే 104 గ్రామాల్లో సర్వే పూర్తిచేశాం. ఈనెల చివరికల్లా సర్వే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. –జయరాజ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జిల్లా అధికారి

పారదర్శకంగా భూ సర్వే

తిరుపతి అర్బన్: 'భూ సర్వే పారదర్శకంగా జరగాలి. భూ సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయాలి. ఈ మేరకు ఆయా గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలి' అని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన జేసీ డీకే బాలాజీతోపాటు జిల్లా అధికారులతో కలిసి భూ సర్వేతోపాటు ఉద్యోగుల ముఖాధారిత హాజరు, సంక్షేమ పథకాలపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీసర్వే పాదర్శకంగా జరగాలని, ఎలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వద్దని సూచించారు. జిల్లాలో చుక్కల, అనాధీనం భూముల వివరాలు సిద్ధం చేయాలని చెప్పారు. ఎస్సీ కాలనీల్లో శ్మశాన వాటికల గుర్తింపు, భూ కేటాయింపు త్వరగా జరగాలన్నారు. డీఆర్వో శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్ శంకరనారాయణ, జిల్లా ఆర్‌అండ్ బీ అధికారి సుధాకర్‌రెడ్డి, ఎస్సీ సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, ఇన్‌చార్జ్ ఏఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ డీకే బాలాజీ

ముమ్మరంగా అవగాహన సదస్సులు

భూసర్వేపై అధికారులు గ్రామాల్లో ముమ్మరంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. సర్వే ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను తెలియజేస్తున్నారు. అయితే సముద్రతీర ప్రాంతాలతోపాటు సమీప గ్రామాల్లో భూములు ఒకరికి, సాగు మరో రైతుకు.. పత్రాలు ఇంకో రైతుకి చెందినవిగా ఉండడంతో ఆయా ప్రాంతాల్లో ఊరూరా సర్వేలు నిర్వహిస్తున్నారు. అన్‌రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన భూముల్లో సాగులో ఉన్న రైతుకే భూహక్కు పత్రాలు ఇచ్చేలా వివరణ ఇస్తున్నారు. ఎవైనా ఇబ్బందులుంటే రైతులు సమిష్టిగా ఒక నిర్ణయానికి రావాల్సి ఉందని సూచిస్తున్నారు. భూముల గందరగోళానికి స్వస్తి చెప్పేలా అధికారులు స్పష్టత తీసుకొస్తున్నారు.



గ్రామాల్లో సర్వేపై అవగాహన సదస్సులు

నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు

- ఆకట్టుకున్న బుల్లి శాస్త్రవేత్తల ప్రయోగాలు
- రాష్ట్ర స్థాయికి పది సైన్స్ ప్రదర్శనలు
- విద్యార్థులకు ఎమ్మెల్యే, కలెక్టర్ అభినందనలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): నేటి విద్యార్థులే రేపటి భావి శాస్త్రవేత్తలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆర్‌పీబీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. జగనన్న ప్రభుత్వంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. అనంతరం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన పలు విద్యావైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయన్నారు. బాలికలు 40 నుంచి 50 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న గోరుముద్దలో చిక్కీ తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఆకట్టుకున్న ప్రయోగాలు

జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో ఇదివరకే మండలస్థాయిలో ఎంపికైన 170 ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఇవి సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కొన్ని ప్రదర్శనలు నిత్యం మనం ఉపయోగించి పడేసిన వాటితో ప్రాజెక్టులు తయారు చేశారు. ఎకోఫ్రెండ్లీ మెటీరియల్స్‌లో భాగంగా నీటిపై తేలియాడే వ్యర్థాలను, శాస్త్రసాంకేతికతతో తొలగించే విధానాన్ని, గార్బేజ్ క్లీనింగ్ రోబోట్ అనే ప్రయోగ నమూనా సందర్శకులను ఆకర్షించింది. ఇందులోనే సోలార్ రూఫింగ్ ఆన్ తార్ రోడ్స్ అనే ప్రాజెక్టు, ఆటోమేటిక్ సర్వీసింగ్ రోబోట్, ఆటో సెలైన్ ఇండికేటర్, స్మార్ట్ హైజీన్ టాయ్‌లెట్ తదితర ప్రదర్శనలు అలరించాయి.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రదర్శనలు

- మినరల్ వాటర్ క్యాన్ క్లీనింగ్ మిషన్. (జెడ్పీ ఉన్నత పాఠశాల తడుకు ఆర్.ఎస్.విద్యార్థి ప్రియాంక, గైడ్ టీచర్ గజరాజన్)
- ఎకో ఫ్రెండ్లీ కంటైనర్ ఫర్ సీడ్ లింక్ (జెడ్పీ ఉన్నత పాఠశాల, ముచ్చివోలు, విద్యార్థి ధర్మతేజ, గైడ్ టీచర్ డాక్టర్ సుబ్రమణ్యంశర్మ)
- హైజీన్ టాయ్‌లెట్ (జెడ్పీ ఉన్నత పాఠశాల బాలురు, రేణిగుంట, విద్యార్థి యోగేంద్ర, గైడ్ టీచర్ మోహన్ బాబు)
- షోల్డర్ పెయిన్ రెడ్యూసర్ (జెడ్పీ ఉన్నత పాఠశాల, తడుకు ఆర్.ఎస్. విద్యార్థి పార్థువర్మ, గైడ్ టీచర్ -భానుప్రసాద్)
- స్మార్ట్ బ్లైండ్ స్టిక్ (జెడ్పీ ఉన్నత పాఠశాల మెట్టు, విద్యార్థి చక్రధర్, గైడ్ టీచర్ రవి)
- స్మార్ట్ డస్ట్ బిన్. జెడ్పీ ఉన్నత పాఠశాల (నారాయణవనం, విద్యార్థి జ్యోత్స్న, గైడ్ టీచర్ శ్యామలత)
- సీఓ2 క్యాప్చరింగ్ మిషన్ (జెడ్పీ ఉన్నత పాఠశాల, బీ.ఎన్.కండ్రిగ, విద్యార్థి పుష్కల్, గైడ్ టీచర్ గౌరి)
- ఎఫెక్టివ్ గ్లోబల్ వార్మింగ్, (ఏపీటీడబ్ల్యూఆర్ఎస్. వెంకటగిరి, విద్యార్థి భార్గవి, గైడ్ టీచర్ షకీనా)
- క్లీనో మీటర్ విత్ లేజర్ లైట్ (జెడ్పీ ఉన్నత పాఠశాల నెల్లూరు, విద్యార్థి హారిక, గైడ్ టీచర్ రమేష్)
- త్రీడీ హాలో గ్రామ్ (జెడ్పీ ఉన్నత పాఠశాల ఎస్.ఆర్.ఎస్.జీ.హెచ్, విద్యార్థి గౌతమ్, గైడ్ టీచర్ లత)

ఈ పది ప్రదర్శనలు ఈనెల 28వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలలో పాల్గొంటాయి. కార్యక్రమంలం డీఈఓ శేఖర్‌రెడ్డి, డీఎస్పీ విశ్వనాథ్, గూడురు డీవైఈఓ శివప్రకాష్‌రెడ్డి, ఆర్డీఓ రామారావు, సీవ అంజూయాదవ్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఆర్కాడ్ శంకర్ పాల్గొన్నారు.



ప్రథమ బహుమతి అందుకున్న మినరల్ వాటర్ క్యాన్ క్లీనింగ్ మిషన్



గెలుపొందిన విద్యార్థులతో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు

సింగపూర్ సంస్థతో ఒప్పందం



ఒప్పంద పత్రం మార్చుకుంటున్న ఎస్వీయూ వీసీ రాజారెడ్డి

తిరుచానూరు : ఎస్వీయూ వీసీ కార్యాలయంలో సోమవారం సింగపూర్ కేంద్రగా నడిచే 'ప్లానెట్ వైస్ ప్రైవేట్ లిమిటెడ్ వారితో పరస్పర అంగీకారంతో ఒప్పందం చేసుకున్నారు. ఈ అంశంపై వీసీ మాట్లాడుతూ కార్బన్ రహిత పర్యావరణం కోసం 'ప్రకృతి సుర్క్ష'పేరుతో ప్రారంభమైన కార్యక్రమంలో ఎస్వీయూ భాగస్వామ్యమవుతుందన్నారు. ఇండియాలో కార్బన్ రహిత పర్యావరణాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలిపారు. అనంతరం ప్లానెట్ వైస్ కో ఫౌండర్ పి.రవికి ఒప్పంద పత్రం అందజేశారు. ప్రొఫెసర్ వరదరాజన్, ప్రొఫెసర్ దివాకర్‌రెడ్డి, ఆచార్య రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు

తిరుపతి అలిపిరి: టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు సోమవారం ఉత్సాహంగా సాగాయి. 45 ఏళ్లలోపు మహిళల త్రోబాల్ పోటీల్లో ఎస్.ద్రాక్షాయణి జట్టు విజేతగా నిలవగా, స్వప్నమంజరి జట్టు రన్నరప్‌గా నిలిచింది. 45 ఏళ్లు పైబడిన మహిళల త్రోబాల్ పోటీల్లో ఎం.శోభారాణి జట్టు విజేతగా నిలవగా, బి.సులోచనారాణి జట్టు రన్నరప్‌గా నిలిచింది. విశ్రాంత పురుష ఉద్యోగుల సింగిల్స్ క్యారమ్స్ పోటీల్లో బి.పాండురంగారెడ్డి విజయం సాధించగా, పి.జయచంద్ర రన్నరప్‌గా నిలిచారు. విశ్రాంత పురుష ఉద్యోగుల క్యారమ్స్ డబుల్స్ పోటీల్లో పి.రాజయ్యనాయుడు, జెఎ.దాస్ జట్టు విజయం సాధించగా, పి.హరిబాబు, పి.అశోక్‌కుమార్ జట్టు రన్నరప్‌గా నిలిచింది.

క్లుప్తంగా

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం


ప్రధాన నిందింతుడు సాధుహరి

తిరుచానూరు: తనపల్లి సమీపంలో ఇందిరమ్మ ఇళ్ల వద్ద గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి నాలుగు కిలోల గంజాయిని తిరుచానూరు పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. తిరుచానూరు ఎస్ఐ వెంకటసుబ్బయ్య కథనం.. పద్మావతిపురానికి చెందిన సాధుహరి30), అవిలాల - వేముల మునీంద్ర అలియాస్ మునీంద్రబాబు 28), అంబేడ్కర్ కాలనీ- కదారి శ్రీకాంత్ 27), తనపల్లి - కరమంచి అజయ్‌కుమార్ 27), ఎల్‌బీసీ రోడ్డు లోని మంచినీళ్లగుంట - చింతకొండల చంద్రశేఖర్ అలియాస్ బుల్లెట్ 40), తాటితోపు వెంకటపతి నగర్ - దూదేకుల బావయ్య అలియాస్ బాషా 41) తనపల్లి సమీపంలోని ఇందిరమ్మ ఇళ్ల వద్ద గంజాయి తాగడంతో పాటు విక్రయిస్తున్నారు. సీఐ సుబ్రమణ్యంరెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని నిందితులను పట్టుకుని వారి నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎస్పీఎల్ విజేత సీకాం

- అట్టహాసంగా ముగిసిన జిల్లా స్థాయి సాక్షి ప్రీమియర్ లీగ్
- క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయడానికే ఎస్పీఎల్
- కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి వెల్లడి

SAKSHI MEDIA GROUP


ఎస్పీఎల్ ఫైనల్స్ మ్యాచ్‌లో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

SAKSHI PREMIER LEAGUE

తిరుపతి ఎడ్యుకేషన్ : సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో తిరుపతి సమీపం తుమ్మలగుంటలోని క్రికెట్ మైదానాల్లో గత వారం రోజులుగా నిర్వహించిన సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్పీఎల్) జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం అట్టహాసంగా ముగిశాయి. ఈ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి సీనియర్స్ విభాగంలో 31, జూనియర్స్ విభాగంలో 7, మొత్తం 38 జట్లు పాల్గొన్నాయి. లీగ్, నాకౌట్ పద్ధతిలో ఐసీసీ నియమనిబంధనలకు అనుగుణంగా ఐపీఎల్ తరహాలో ఎస్పీఎల్‌ను నిర్వహించారు. లీగ్, నాకౌట్‌లో ప్రతిభ కనబరచి ఫైనల్స్‌కు చేరుకున్న సీనియర్స్, జూనియర్స్ జట్లుకు సోమవారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తిరుపతిలోని సీకాం విద్యాసంస్థల జట్లు సీనియర్స్, జూనియర్స్ విభాగాలు రెండింటిలో సత్తాచాటి జిల్లా స్థాయిలో విజేతగా నిలిచాయి. ఈ జట్లు త్వరలో జోనల్ స్థాయిలో నిర్వహించనున్న సాక్షి ప్రీమియర్ లీగ్ పోటీల్లో పాల్గొననున్నాయి.

సీనియర్స్ రెండో సెమీ ఫైనల్

సీనియర్స్ విభాగంలో తిరుపతి సీకాం డిగ్రీ, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల జట్ల మధ్య నిర్వహించిన రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో సీకాం జట్టు 15 పరుగుల తేడాతో గెలుపొంది ఫైనల్‌కు చేరింది. తొలుత బ్యాటింగ్ చేసిన సీకాం జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 99పరుగులు చేయగా తరువాత బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌జీఎస్ జట్టు 10ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసింది.

జూనియర్స్ ఫైనల్ విజేత సీకాం జూనియర్ కళాశాల

జూనియర్స్ విభాగంలో తిరుపతి సీకాం జూనియర్ కళాశాల, ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో సీకాం జట్టు 29 పరుగుల తేడాతో గెలుపొంది. తొలుత బ్యాటింగ్ చేసిన సీకాం జట్టు 10 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 105 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన ఎమరాల్డ్స్ జట్టు 10 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 76 పరుగులు చేసింది.

సీనియర్స్ ఫైనల్ విజేత సీకాం డిగ్రీ కళాశాల

సీనియర్స్ విభాగంలో సీకాం డిగ్రీ కళాశాల, శ్రీవిద్యానికేతన్ జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో సీకాం జట్టు 40 పరుగుల తేడాతో గెలుపొంది. తొలుత బ్యాటింగ్ చేసిన సీకాం జట్టు 10 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 89 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన విద్యానికేతన్ జట్టు 10 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 49 పరుగులు మాత్రమే చేసింది.

ఓటమే గెలుపునకు నాంది


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ఓటమే గెలుపునకు నాంది అని, గెలుపోటములను సమానంగా స్వీకరించిన వారే నిజమైన క్రీడాకారులని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఎస్పీఎల్ ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విన్నర్స్, రన్నర్స్ జట్లకు ట్రోఫీలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు, క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. తిరుపతిలో స్టేడియం నిర్మాణానికి అనువైన స్థల ఎంపిక ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు నచ్చిన క్రీడల్లో రాణించాలన్నారు. క్రికెట్ వంటి క్రీడల్లో జట్టు సభ్యుల సమిష్టి కృషితోనే విజయం సాధించగలరని తెలిపారు. క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు సాక్షి ఎస్పీఎల్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తిరుపతి రూరల్ తహసీల్దార్ ఎం.లోకేశ్వరి, అంపైర్లు డి.రమేష్, జి.కిరణ్‌కుమార్, స్కోరర్ జ్యోతి, సాక్షి బ్రాంచ్ మేనేజర్ సత్యేంద్రబాబు, బ్యూరో ఇన్‌చార్జ్ టి.రవిరెడ్డి, ఈవెంట్స్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


జూనియర్స్ విభాగంలో విజేతగా నిలిచిన సీకాం జూనియర్ కళాశాల జట్టు


జూనియర్స్ విభాగంలో రన్నర్స్‌గా నిలిచిన ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల జట్టు


సీనియర్స్ విభాగంలో గెలుపొందిన సీకాం డిగ్రీ కళాశాల జట్టు


సీనియర్స్ విభాగంలో రన్నర్స్ స్థానంలో నిలిచిన శ్రీవిద్యానికేతన్ జట్టు

స్పందన అర్జీలకు ప్రాధాన్యం


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీతో పాటు పలువురు అధికారులు

తిరుపతి అర్బన్: స్పందనలో వచ్చే అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన జేసీ డీకే బాలాజీ, డీఆర్వో శ్రీనివాసరావుతోపాటు స్పెషల్ కలెక్టర్లు కోదండ రామిరెడ్డి, భాస్కర్‌నాయుడుతో కలిసి స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మొత్తం 112 ఫిర్యాదులు రాగా అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 76 అర్జీలు ఉన్నట్టు తెలిపారు. సంబంధిత అర్జీలను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

పోలీస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


పోలీస్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఐజీ రవిప్రకాష్, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా పోలీస్ సంఘం క్యాలెండర్, డైరీని సోమవారం అనంతపురం రేంజ్ డీఐజీ రవిప్రకాష్, జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. జిల్లాల పునర్విభజనలో ఏర్పడిన తిరుపతి జిల్లాలో మొదటిసారి క్యాలెండర్, డైరీని రూపొందించినట్టు డీఐజీ తెలిపారు. వీటిలో పోలీస్ సిబ్బందికి ఉపయోగపడే సమాచారం, సెలవులు, భద్రత, ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించినట్టు తెలిపారు. ఏఎస్పీ విమలకుమారి, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమశేఖర్ రెడ్డి, శంకర్ రెడ్డి, కామరాజు, పురుషోత్తం నాయుడు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మూడు దుకాణాలు దగ్ధం

- సుమారు రూ.10 లక్షలకు పైగా నష్టం



నాయుడుపేటటౌన్: పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మూడు దుకాణాలు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన సోమవారం రాత్రి దుకాణాలను మూసి వేసిన తరువాత చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న వెల్డింగ్ షాపులో పెద్ద ఎత్తున మంటలు వస్తుండడాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందజేశారు. అధికారులు సంఘటన స్థలానికి చెరుకునే సరికే వెల్డింగ్ షాపుతో పాటు పక్కనే ఉన్న రెండు మెకానిక్ షాపులకు సైతం మంటలు అంటుకున్నాయి. సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు నేతృత్వంలో అగ్నిమాపక శాఖ అధికారులు దుకాణాల్లో మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో చుట్టుపక్కల దుకాణాలు వారు ఊపిరి పీల్చుకున్నారు. మూడు దుకాణాల్లో వస్తువులన్నీ మంటలకు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.10 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

తిరుపతి రూరల్: భర్త, కుటుంబ సభ్యుల వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం ముత్యాలరెడ్డిపల్లి సీతమ్మనగర్‌లో చోటుచేసుకుంది. ఎంఆర్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా చిన్నమండ్యంకు చెందిన రెడ్డికళ(22)కు తిరుపతిలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న సాయితో 2022 ఫిబ్రవరిలో వివాహం అయింది. పెళ్లైన నాటి నుంచి భర్త, అతని కుటుంబ సభ్యులు రెడ్డికళను వేధింపులకు గురిచేసేవారు. సోమవారం తెల్లవారుజామున మరోసారి రెడ్డికళపై దాడిచేశారు. దీంతో వేధింపులు భరించలేక ఆమె ఇంట్లో ఉన్న ఇనుప రాడ్‌కు ఉరివేసుకుంది. ఆలస్యంగా గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు భర్త సాయి, మరికొందరిపై కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు సంజు



కలువాయి: ఎప్పుడో 2021లో వెళ్లిపోయిన బాలుడు ప్రస్తుతం తల్లిదండ్రుల చెంతకు క్షేమంగా చేరడంతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. వివరాలు.. కలువాయి మండలం, ఉయ్యాలపల్లి దళితవాడకు చెందిన దండు సంజు నాలుగేళ్ల వయసులో 2021, జూన్ 29న ఇంటి బయట ఆడుకుంటుండగా తప్పిపోయాడు. ఈ విషయం అప్పట్లో సంచలనమైంది. తల్లిదండ్రులు బుజ్జయ్య, వరలక్ష్మి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాలనీకి సమీపంలో అటవీ ప్రాంతం కావడంతో అడవిలోకి వెళ్లి తప్పిపోయి ఉంటాడని పోలీసులు తీవ్రంగా గాలించారు. డ్రోన్ కెమెరాలు, డాగ్ స్క్వాడ్‌తో గాలించినా సంజు ఆచూకీ లభించలేదు. దీంతో ఎవరైనా ఎత్తుకెళ్లి ఉంటారని తల్లిదండ్రులు సైతం బాలుడిపై ఆశ వదులుకున్నారు. అయితే తమ బిడ్డ ప్రకాశం జిల్లా, పామూరులో ఓ గిరిజన కుటుంబం వద్ద ఉన్నాడని కలువాయి మండలం, తోపుగుంటకు చెందిన వారు సమాచారం ఇవ్వడంతో సోమవారం తల్లిదండ్రులు అక్కడికి వెళ్లి బిడ్డను గ్రామానికి తీసుకువచ్చారు. వైఎస్సార్ జిల్లా, రాజంపేటకు చెందిన నారాయణ అనే వ్యక్తి ఈ బిడ్డను తమకు ఇచ్చి వెళ్లిపోయాడని ఆ గిరిజన కుటుంబం వారు చెప్పినట్లు సంజు తల్లిదండ్రులు తెలిపారు.

కలెక్టరేట్ వద్ద మహిళ ఆత్మహత్యాయత్నం


భూ పత్రాలు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం శ్రీకాళహస్తి పట్టణం, పానగల్ ప్రాంతానికి చెందిన పద్మమ్మ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్పందన కార్యక్రమంజరుగుతున్న సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటిచుకోబోయేంది. అనంతరం పోలీసులు అడ్డుకుని ఆమెను కాపాడారు.

తమ భూమిని ఆక్రమించారని ఆరోపణ

పద్మమ్మ మాట్లాడుతూ భర్త కోటయ్య ఇటీవల మృతిచెందాడని, అప్పటి నుంచి బంధువులే తమ వ్యవసాయ భూమిని ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న జేసీ డీకే బాలాజీ బాధితురాలి వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం శ్రీకాళహస్తి తహసీల్దార్ నుంచి సమాచారం సేకరించారు. అందులో పద్మమ్మ పేరుపై భూములు లేవని, వారి బంధువులకు చెందిన భూములుగా ఉన్నాయని నివేదిక ఇవ్వగా దాన్ని కలెక్టర్‌కు సమర్పించారు. కలెక్టర్ స్పందిస్తూ ఏ సమస్యలొచ్చినా ముందుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. అంతేతప్ప ఇలాంటి చర్యలకు పాల్పడడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు.